క్లుప్తంగా

రేపు మహా పడిపూజ

కుంటాల: మండలంలోని కల్లూర్ వాసవి కళాశాలలో ఆదివారం అయ్యప్ప మహా పడిపూజ నిర్వహించనున్నట్లు కళాశాల యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ గురు మంచి చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో నిర్వహించే పూజా కార్యక్రమానికి అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు.

వరి కొయ్యలకు నిప్పు.. భూసారానికి ముప్పు



ధర్మోరలో నిప్పు పెట్టిన రైతులు

లోకేశ్వరం: పొలంలోని వరి కొయ్యలకు నిప్పు పెడితే భూమి వెడెక్కి సారం దెబ్బతింటుందనే కనీస అవగాహన చాలా మంది రైతుల్లో కొరవడింది. దీంతో అధిక మోతాదులో యూరియా, డీఏపీలను వినియోగిస్తూ భూమిలోని లవణాలు కోల్పోయేలా చేస్తున్నారు. పొలంలో నాటు వేసేటప్పుడు ఇబ్బందులు తలెత్తుతున్నాయంటూ మండలంలోని కొందరు రైతులు గడ్డితోపాటు వరికొయ్యలకు నిప్పు పెడుతున్నారు. దీంతో భూమిలోని మిత్ర పురుగులు నశించిపోతాయని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. వరికొయ్యలను కాల్చకుండా పొలంలోనే దున్నేయాలని వారు సూచిస్తున్నారు.

ఆలయంలో అన్నదానం

ఖానాపూర్: పట్టణంలోని లలితా పరమేశ్వరి అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం అన్నదానం నిర్వహించారు. తగిలపెల్లి నాగజ్యోతి, ఆనంద్ దంపతులు ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అడిదెల రాజన్న తదితరులు ఉన్నారు.

వైన్ షాపు వద్దని ఆందోళన



ఆందోళన చేస్తున్న స్థానికులు

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటుచేసే వైన్ షాపు ఇక్కడ వద్దంటూ స్థానికులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఎస్సీ కాలనీ బోయవాడ మహిళలు కలిసి నిరసనకు దిగారు. వైన్‌షాప్ ఏర్పాటుతో ఇబ్బందిగా మారుతుందన్నారు. అధికారులు స్పందించి వైన్‌షాపు వేరే చోటికి మార్చాలని కోరారు. మహిళలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బోసిపోయిన పల్లెలు



నిర్మానుష్యంగా నెన్నెల హన్మాన్ చౌరస్తా

నెన్నెల: మొన్నటి వరకు నాయకులు, ప్రచార రథాలు, ఇంటింటా ప్రచారంతో సందడితో నిండిన పల్లెలు ప్రస్తుతం మూగబోయి శుక్రవారం బోసిపోయి కనిపించాయి. నిత్యం జనంతో సందడిగా కనిపించిన రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. రైతులు కూలీలు పొలంబాట పట్టారు. వివిధ పార్టీల కార్యకర్తలతో రద్దీగా ఉన్న హోటళ్లు, దుకాణాలు వెలవెలబోయాయి. నెలపాటు ప్రచార సందడి, పోలీసులు చక్కర్లు కొడుతూ కనిపించిన హడావిడి ప్రస్తుతం నిశబ్దం అయిపోయింది. ఓటు వేయడానికి సొంత గ్రామాలకు చేరుకున్న పల్లె ప్రజలతో గ్రామాల్లో సందడి నెలకొంది. ఓటింగ్ ముగియడంతో ఎటు వాళ్లు అటు వెళ్లిపోయారు.

గిరి గ్రామాల దశ మారేనా?

- కనీస సౌకర్యాలు కరువు
- రోడ్డు సౌకర్యం లేక విద్య, వైద్యానికి దూరమవుతున్న గిరిజనులు
- కొత్త ప్రభుత్వంపైనే ఆశలు



ఉమార్థ, ఇంద్రనగర్‌కు వెళ్లేదారి ఇలా..



గిరిజాయి సమీపంలోని వాగు దాటుతున్న గిరిజనులు

బజార్‌హత్నూర్: మండలంలోని మారుమూల అటవీ ప్రాంతంలో గల ఆదివాసీ గిరిజన గ్రామాలో వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు లేకపోవడంతో గిరిజనులు విద్య, వైద్యానికి దూరమవుతున్నారు. బజార్‌హత్నూర్ మండలంలో పలు గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. బోథ్ ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గం అయినప్పటికీ గిరిజనుల సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఎన్నికల సమయంలో ఆరు నెలల్లో రోడ్డు సౌకర్యం కల్పిస్తామని ప్రజాప్రతినిధులు హామీ ఇస్తున్నారు తప్పా.. అమలు చేయడం లేదు.

అభివృద్ధికి నోచుకోని గ్రామాలు..

మండలంలోని అటవీ ప్రాంతంలో గల గిరిజన గ్రామాలకు ఆరు దశాబ్దాలుగా రవాణా సౌకర్యం లేక అభివృద్ధికి నోచుకోవడం లేదు. మండలంలోని గిరిజాయి, డేడ్రా, మాన్కపూర్, ఉమర్ద(బి), గోసాయి ఉమర్ద(జీ), ఇంద్రనగర్, బద్దునాయక్ తండా, హర్కాయి, చిన్నుమీయతండా, రాజులగూడ, కిన్నరపల్లి, మోహద, కొత్తపల్లి, రతన్‌గూడ, చింతకర్ర గ్రామాలు ఏర్పడి 60 ఏళ్లు అవుతున్నా.. నేటికి పాలకులు రోడ్డు సౌకర్యం కల్పించలేదు. ఈ గ్రామాల ప్రజలు కాలినడకన అడవి గుండా ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి. వర్షం పడితే సైకిల్ కూడా వెళ్లలేని దుస్థితి. ఎవరైనా అనారోగ్యంతో మంచం పడితే మండల కేంద్రానికి రావడానికి ఎడ్లబండ్లను ఉపయోగిస్తారు. ఇటీవల రోడ్డు సౌకర్యం లేక దేడ్ర గ్రామానికి చెందిన ఒక బాలుడికి సకాలంలో వైద్యం అందక మృతి చెందాడు. ఉమార్దకు చెందిన ఒక గర్భిణి పురుటి నొప్పులతో బాధపడుతున్న సమయంలో అంబులెన్స్ రాకపోవడంతో ఎడ్లబండిలో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. ఇలా విద్య వైద్యానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు జరగడంతో కొత్తగా ఏర్పాటు అయ్యే ప్రభుత్వంపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికైనా తమ సమస్యలు పరిష్కరించాలని, గ్రామంలో కనీస వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



భూతాయి నుంచి డేడ్ర, గిరిజాయి, ఉమార్ధ మాన్కపూర్ గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.20 కోట్లు ఐటీడీఏ ద్వారా నిధులు మంజూరయ్యాయి. అయినా.. కూడా రోడ్డు వేయలేదు. ఏళ్ల తరబడి రవాణా సౌకర్యం లేక గిరిజనులు చాలా ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే బయట ప్రపంచంతో సంబంధాలు ఉండవు. అనారోగ్యం పడితే వాగులు దాటలేక, రోడ్డు సౌకర్యం లేక చికిత్స కోసం చెట్ల పసరే దిక్కు.

– కుమ్ర సంగీత, సర్పంచ్, గిరిజాయి

రేషన్ బియ్యానికి రక్షణేది?



గోదాం బయట నిల్వ చేసిన బియ్యం బస్తాలు

లోకేశ్వరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ గోదాం బయట నిల్వ చేసిన రేషన్‌బియ్యానికి రక్షణ కరువైంది. ఇప్పటికే గోదాంలో బియ్యం ఉండటంతో అధికారులు మిగిలిన బస్తాలను ఆరుబయట నిర్లక్ష్యంగా పడేశారు. ఈ బస్తాలు వర్షానికి తడిసే ప్రమాదం ఉంది. మరోవైపు ప్రహరీ లేకపోవడంతో పందులు, ఇతర పశువులు గోదాం ఆవరణలోకి వచ్చి ధాన్యాన్ని ధ్వంసం చేసే అవకాశం ఉంది. ఈ బియ్యానికి భద్రత ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వందశాతం పోలింగ్ నమోదు

- ఆదర్శంగా నిలిచిన బావుజిపేట్ గ్రామం



రోడ్డు సౌకర్యం లేక నడిచి వెళ్తున్న ప్రజలు

ఇచ్చోడ: ఇచ్చోడ మండలంలోని బావుజిపేట్ మారుమూల గిరిజన గ్రామం. కనీస సౌకర్యాలు కూడా లేవు. కానీ గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడి ఓటర్లు వంద శాతం ఓట్లేసి ఆదర్శంగా నిలిచారు. సిరిచెల్మ నుంచి దాదాపుగా 7 కిలోమీటర్లు పొడవున గ్రామస్తులు కాలినడకన నడిస్తే కానీ గ్రామానికి చేరుకోలేరు. అత్యవసర సమయంలో ఎడ్లబండి తప్పా ఆటో కూడా వెళ్లలేని పరిస్థితి. కానీ అక్కడి ప్రజలు నియోజకవర్గంలోనే ఆదర్శంగా నిలిచారు. బావుజిపేట్‌లో పురుషులు 170, మహిళలు 200 ఓట్లు మొత్తం 370 ఓట్లు ఉన్నాయి. గురువారం జరిగిన ఎన్నికలలో 370 ఓట్లు వేయడంతో వందశాతం పోలింగ్ నమోదైంది.

‘కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం’



మాట్లాడుతున్న వెడ్మ భొజ్జు

ఉట్నూర్‌రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ఖానాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ భొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలపై ప్రజలకు నమ్మకం ఏర్పడిందన్నారు. మతాలకు అతీతంగా ప్రతిఒక్కరూ కాంగ్రెస్ విజయం కోసం కృషి చేశారని తెలిపారు. భారీ మెజార్టీతో తనను గెలిపించడానికి కృషిచేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో లింగంపల్లి చంద్రయ్య, బెల్లూరి వామన్‌రావు, ఖయ్యూం, ఎక్బాల్, రాధాబాయి, దూట రాజేశ్వర్, సలీం పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనకు కృషి చేయాలి

- ప్రజలకు అవగాహన కల్పించిన వైద్య సిబ్బంది



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు



భీంపూర్‌లో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



మాట్లాడుతున్న వైద్యాధికారి సాగర్

తాంసి: ఎయిడ్స్ నిర్మూలనకు ప్రతిఒకరూ కృషి చేయాలని భీంపూర్ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నిఖిల్‌రాజ్ అన్నారు. శుక్రవారం భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలో సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ చేపట్టారు. వైద్యాధికారి మాట్లాడుతూ ఎయిడ్స్ అరికట్టాలంటే నివారణ ఒక్కటే మార్గమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ గంగాధర్, హెల్త్ అసిస్టెంట్ విష్ణు, సిబ్బంది సరస్వతి, ప్రవీణ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని స్థానిక సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. శుక్రవారం ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఎయిడ్స్ విధంగా వ్యాపిస్తుందో వివరించారు. వ్యాధి నివారణ ఒకటే మార్గమని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వర్ణలత, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: అవగాహతోనే ఎయిడ్స్‌ను నివారించవచ్చని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాగర్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆరోగ్య కేంద్రంలో అవగాహన కల్పించారు. ప్రత్యేకంగా యువతకు ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో బ్రహ్మనందంరెడ్డి, సిబ్బంది రాజుబాయి, ఉత్తంసింగ్, రాథోడ్ కైలాస్, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



తనిఖీ చేస్తున్న ఎస్సై లింబాద్రి

ఖానాపూర్: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతోపాటు అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని ఎస్సై జి.లింబాద్రి అన్నారు. శుక్రవారం మండలంలోని తర్లపాడ్-ఖానాపూర్ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పెండింగ్ చలాన్లు ఎప్పటికప్పుడు చెల్లించాలని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లవద్దని ప్రైవేటు వాహనదారులను ఆదేశించారు. ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపేవారు ప్రమాదాల బారిన పడుతున్నారని అవగాహన కల్పించారు. వారి వెంట సిబ్బంది ఉన్నారు.

ఖానాపూర్ నియోజకవర్గంలో పోలైన ఓట్లు



ఖానాపూర్ మండలం ఎర్వచింతల్‌లో ఓటు వేస్తున్న ఓటర్లు

ఖానాపూర్: ఖానాపూర్ నియోజకవర్గంలో పోలైన ఓట్ల వివరాలను అధికారులు వెల్లడించారు. నియోజకవర్గంలో మొత్తం 2,20,526 ఓట్లకు గాను 1,70,815 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఖానాపూర్ మండలంలో 40,281 ఓట్లకు గాను 30,423 మంది తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకున్నారు. కడెం మండలంలో 28,276 ఓట్లకు గాను 22,424 మంది, దస్తురాబాద్ మండలంలో 12,705 ఓట్లకు గాను 10,333 మంది, ఇంద్రవెల్లిలో 30,893 ఓట్లకు గాను 24,801 మంది, జన్నారంలో 43,232 ఓట్లకు గాను 32,462 మంది, పెంబి మండలంలో 10,528 ఓట్లకు గాను 8,317 మంది, ఉట్నూర్ మండలంలో 48,866 ఓట్లకు గాను 36,970 మంది తమ ఓటు వేశారు. సిరికొండ మండలంలోని తొమ్మిది పంచాయతీల్లో 5745 మంది ఓటర్లు ఉండగా 5085 మంది ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

చదువుకు దూరంగా చిన్నారులు



బడికి దూరమై ఇంటి వద్దే ఉంటున్న చిన్నారులు

- పాలవాగు గ్రామంలో బడి లేక రోజంతా కాలక్షేపం
- ఆందోళనలో తల్లిదండ్రులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

సిరికొండ: మండలంలోని కుంటగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని పాలవాగు గ్రామంలో దాదాపు 40 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వీరందరూ వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. కానీ వారి పిల్లలు మాత్రం చదువుకు దూరం అవుతున్నారు. ఆ ఊరిలో పాఠశాల లేకపోవడంతో వారి బాల్యం బుగ్గిపాలు అవుతుంది. గ్రామంలో 30 మంది పిల్లలు ఉంటారు. కనీసం వారికి బడి అంటే తెలియని పరిస్థితి. తమ పిల్లల చదువు గురించి పట్టించుకునే వారే లేరని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుంటాగూడ పాఠశాలకు వెళ్లాలంటే సుమారుగా 4 కిలోమీటర్లు నడుచుకుంటూ.. వెళ్లాలి. ఆదారిలో వాగు ఉండడంతో వారు పాఠశాలకు కూడా వెళ్లడం లేదు. దీంతో చిన్నారులు చదువుకు దూరం అవుతున్నారు.

ఎస్సై చొరవతో..

గత 2018లో అప్పటి ఇచ్చోడ మండల ఎస్సై శంకర్‌నాయక్ వీరి పరిస్థితి చూసి సీఐ సతీష్ కుమార్ సహకారంతో వలంటీర్‌ను నియమించి పిల్లలకు చదువు చెప్పించారు. ఆ తరువాత ఉట్నూర్ ఐటీడీఏ అధికారులు ఆ వలంటీర్‌కు నెలకు రూ. 5వేలు జీతం ఇచ్చి చదువులు కొనసాగించారు. గత కరోనా సమయంలో గ్రామంలోని బడి మూత పడింది. లాక్‌డౌన్ తర్వాత వలంటీర్ చదువులు చెప్పినా.. గౌరవ వేతనం రాకపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ఇప్పుడు గ్రామంలోని చిన్నారులు రోడ్లపై తిరుగుతూ.. తమ బాల్యాన్ని నాశనం చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు తమ గ్రామంలో బడి ప్రారంభించి పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని ప్రజలు కోరుతున్నారు.


పిల్లల భవిష్యత్ మారాలి



మేం బ్రతికినట్లు, మేం పడిన కష్టం మా పిల్లలు రాకుడాదు.పిల్లలను చదువులు నేర్పిద్దామంటే మా గ్రామంలో బడిలేక జీవితాలు ఆగం అవుతున్నాయి. అప్పటి ఎస్సై శంకర్‌నాయక్ గ్రామంలో చిన్న బడిని ఏర్పాటు చేశాడు. కానీ దాన్ని ముందుకు తీసుకెళ్లే నాథుడు లేక మూత పడింది. అధికారులు స్పందించి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలి.

– పెందుర్ భీంరావు, పాలవాగు, గ్రామ పటేల్

జీతం రావడం లేదు



ఎస్సై శంకర్‌నాయక్ సార్ ఏర్పాటు చేసిన బడిలో నన్ను వలంటీర్‌గా నియమించాడు. ఆ సారు ఉన్నప్పుడు నెలనెలా జీతం ఇచ్చేవారు. దీంతో పిల్లలకు చదువులు చెప్పేవాడిని. మళ్లీ ఐటీడీఏ నుంచి కొన్ని నెలలు జీతం ఇచ్చి లాక్‌డౌన్ తర్వాత బంద్ చేశారు. దీంతో నేను వ్యవసాయం చేసుకుంటున్నాను.

– యాదవ్‌రావు, వలంటీర్, పాలవాగు

ఎన్నికల ఫలితాలపైనే చర్చ

- గెలుపోటములపై ముచ్చట
- ఎక్కడా చూసినా ఇదే తీరు



దండేపల్లి మండలంలో చర్చించుకుంటున్న గ్రామస్తులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల పోలింగ్ గురువారం ముగిసింది. జిల్లాలో ఏ నలుగురు గుమిగూడిన గెలుపోటములపైనే శుక్రవారం చర్చ జరుగుతుంది. గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద, పంట పొలాలు, తెల్లకల్లు చెట్లళ్ల, చెట్ల నీడన, రచ్చ బండల కాడ, పట్టణాల్లో టీస్టాళ్లు, హోటళ్లు, కార్యాలయాల్లో, దుకాణాల సముదాయాల్లో ఎక్కడ చూసిన ఫలితాలపై దృష్టి. ఓ ప్రధాన పార్టీ గెలుస్తుందని, లేదు లేదు ఈ పార్టీనే గెలుస్తుందని చర్చించుకుంటున్నారు. మొదటి నుంచి ఆ పార్టీ ప్రచారం బాగా చేసింది. కాని డబ్బులు ఇవ్వకపోవడం వల్లనే వెనకబడిందని అంటున్నారు. పోలింగ్ ముందు రాత్రి ఈ పార్టీ క్వార్టర్ రూ.1000 నుంచి రూ. 1500 డబ్బులు ఎక్కువగా ఇచ్చిందని, లేదు ఆ వాడలో కొందరికి ఇచ్చి మరో వాడలో ఎక్కువగా ఇచ్చారని చర్చ జరుగుతోంది. దీంతోపాటు కొంత రాజకీయాల మీద ఆసక్తి ఉన్న వారు.. మీ నియోజకవర్గంలో ఎట్లుంది.. ఎవరు గెలుస్తారని ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారి బంధువులకు ఫోన్లుచేసి మరీ తెలుసుకుంటున్నారు. గురువారం సాయంత్రం నుంచే టీవీల్లో ఎగ్జిట్‌పోల్స్ సర్వేలు పార్టీల ఫలితాలు వెల్లడించాయి. వాటి ఆధారంగా కొందరు..చేసిన పార్టీ చేసిన అభివృద్ధి, అభ్యర్థుల వ్యక్తితత్వం, వ్యతిరేకత, పంపిణీ చేసిన నగదు, తదితర ఆధారంగా గెలుపోటములను అంచనాలు వేసుకున్నారు.

మొన్నటి వరకు ప్రచారం

మొన్నటి వరకు గ్రామాల్లో, పట్టణాల్లో ఎన్నికలు అభ్యర్థుల ప్రచార రథలు, సభలు, సమావేశాలు, ర్యాలీలు, వీధిల్లో తిరుగుతూ ప్రచారం హోరెత్తించారు. ఎన్నికల ముందు రోజు రాత్రి పంపకాల పై చర్చ జరుగుతే.. పోలింగ్ ముగిసింది. అభ్యర్థులు ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. కార్యకర్తలు, గల్లీ లీడర్లు ఇప్పుడు గెలుపు ఓటములపై బేరసాలు వేసుకుంటున్నారు. పోలైన ఓట్లు, వచ్చే ఫలితాలు ఇలా ఉంటాయనే ఆలోచనలో ఎవరికి వారు అంచనా వేసుకుంటున్నారు.

ఓటేయడంలోనూ ‘ఆమె’ ఆదర్శం



ఓటేసేందుకు క్యూలో మహిళలు (ఫైల్)

దండేపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడంలో దండేపల్లి మండలంలో మహిళలే ఆదర్శంగా నిలిచారు. మండలంలో మొత్తం 40,828 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 20,014 మంది ఓటర్లు, మహిళలు 20,813 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 15,486 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకోగా, మహిళలు 17,227 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటు హక్కు వినియోగించుకోవడంలోనూ మహిళలే పై చేయిగా నిలిచారు.